వేదమతము నాస్తికమతము ఆర్యులదైవములు.

ఇది

బళ్ళారిలో వకీలుగానుండి

కీ. శే. బ్రహ్మశ్రీ॥ కోలాచలం శ్రీనివాసరావుగారిచే

రచియింపఁబడినది.

వారి జ్యేష్ఠపుత్రుఁడగు కె. శత్రుఘ్నరావుచేఁ

ప్రకటింపఁబడియె.

మొదటికూర్పు.

బళ్ళారి.

ఆంధ్రముద్రాక్షరశాలయందు

ముద్రితము.

1926.

Registered Copy-Right.

వెల రు 0—8—0

తమకంటె నత్యధిక శక్తికలవారనియు తమకంటె నధిక నీతిపంతులనియు కావుననే పూజనీయులనియు పూజింపసాగిరి. కొందఱు దైవములను మానవాకారములుగల విగ్రహములుగనొనర్చి యారాధింపసాగిరి. ఇటు కొంతకాలమైనవెనుక, బుద్ధికౌశల్యముగలవారు కొందఱాలోచించి, దైవములకు మానవాకార వికారములు నిషేధించిరి. వేదాంతవిచారులగువారు కొందఱు జ్ఞానస్వరూపమే దైవమని యెన్నిరి. వర్ణింపనలవికానట్టియు, నగోచరమగునట్టియు, చిత్రమహిమలు గలిగించునట్టియు, శక్తులన్నియును నొక్కరూపుగొనియున్న దైవమొక్కఁడేయని కొందఱుతలంచిరి. ఇదియే యేకదైవోపాసన బహుదైవోపాసనము లొనర్చుచు విద్యాతిశయ సామర్థ్యమున నాలోచించి చిత్తశుద్ధిఁగాంచినఁగాని యేకదైవోపాసన సిద్ధింపదు. ప్రపంచమునందిప్పుడుగల నాగరికతయు బుద్ధికుశలతయు బహుదైవోపాసనలనుండి ఫలించినవనుటకు సందియంబులేదు. నేఁ డేకదైవోపాసకులను క్రిస్టియనులున్ను, జ్యూలున్ను, మహమ్మదీయులున్ను నొకానొక కాలమున బహుదైవోపాసకులుగ నుండినవారేను. వీరొనరించునది మానసవిగ్రహపూజ. ఇతరులొనరించునది లోహవిగ్రహపూజ. ఏకదైవోపాసనాశక్తి ప్రారంభమునఁగుదురుట దుర్లభము. అట్టిశక్తి, గొప్పశక్తికిఁగలుగును. ఈవిషయమున నిమ్రాడనువానికిని నేబ్రహాంకును జరిగిన వాదము సూక్ష్మముగ నిందువ్రాసెద.

నిమ్రాడు. ఏబ్రహాం! నీతండ్రులుపూజించిన విగ్రహములను నీవుపూజింపవు. అగ్నినైనను స్తుతింపుము.

ఏబ్రహాం. అగ్నినీళ్లచేఁ జల్లారునుగదా; నీళ్లనేల నుతింపఁగూడదు?

నిమ్రాడు. అటులయిన నీళ్లనునుతింపుము.

ఏబ్రహాం. జలమును దనలోనుంచుకొనిన మేఘము నేలనుతింపఁగూడదు?

నిమ్రాడు. మేఘమునునే నుతింపుము.

ఏబ్రహాం. మేఘములనుఁ జెదరఁదోలు గాలినేల నుతింపఁగూడదు?

నిమ్రాడు. గాలినేనుతింపుము.

ఏబ్రహాం. గాలినెదిరించినిలుచు మానవునేల పూజింపఁగూడదు?

పైరీతిగవాదించెను. ఇటు లెదిరించుశక్తి లభ్యమగుటకు నెంతః కావలెనో, యెంత యాలోచనకావలయునో యెంతయనుభవము కావలయు. చదువరు లూహింపనగును.

బహుదైవోపాసనమునుండి యేకదైవోపాసనకు హెచ్చవలెననిన నెంతటి

27116
2.3.73

ప్రారంభమున దైవమను నామమెట్లు వచ్చెను? ఆ నామము రాకమునుపు పురాతనార్యులా వస్తువును నేమని పిలుచుచుండిరి? అను సంశయ మందఱి హృదయములం దంకురించుట సహజమేను. మనమిపుడు భావించు దైవములను నామము ప్రారంభమున నెట్లు వచ్చినది నేనించుక ముచ్చటించెద.

పురాతనార్యులు విశాలమగు ప్రపంచమున ప్రకాశించు వస్తువులును మలిన వస్తువులును గాంచెను. ప్రకాశించు వస్తువును "దేవ్" యని పిలిచెను. "దివ్" యన ప్రకాశించుట యని ధాత్వర్థము. ప్రకాశించుచుండు వస్తువుల నెల్ల ప్రేమించెను. మలిన వస్తువులను భీతిల్లుచుండెను. పగటి పై ప్రేమ అంధకారమును గన నసహ్యము. దేవశబ్దము దైవమునకే గాక ప్రకాశించుటను విశేషణముగ ఋగ్వేదమునందనేక స్థలముల నుపయోగింపబడినది "దేవాయుషస్స" న ప్రకాశించు నుషస్సులారా యనియర్థము. కాలాంతరమున పై నీ "దేవ" శబ్దము మనమిపుడుపయోగించుచున్న దైవమనెడి నర్థమున రూఢికి వచ్చెను. ప్రకాశించు వస్తువులపై ప్రేమయు మలిన వస్తువులపై నసహ్యతయు జనులకు బుట్టుట స్వాభావసిద్ధమని నాకు దోచెను. ఈ రీతిగ మానవసృష్టి కాలమునుండియు దరతరములుగ మానసము ప్రకాశించు వస్తువులకే బంధింపబడుచుండినవి. ఇట్టి తలంపు మానసమునకు నలవాటయి యది యొకమతమయ్యెను. ప్రపంచంబున జననమందిన జనులలో నెక్కడైనను బై రీతిగ మతమును సరింపని మనుజుండు లేడని నే దలచెద. ఎంతటి నాస్తికుడైనను మానసమునందు మతమొకవిధముగ బాధింపక తప్పదు. జర్మనీవారు తమకు మతమే యక్కఱలేదనియును దాము నాస్తికులమ్యేదమనియును జెప్పుచు నటులగుటకు నెంత ప్రయత్నించినను వారియందే మతాభిప్రాయములు హెచ్చుగ బెఱుగుచున్నవి. విపరీత మతాభిప్రాయములు గలవారు కొందఱు గుళ్లకు బోవని వారనియు దేవపూజ లొనర్పని వారనియు నాస్తికులని వెక్కిరింతురు. అది తప్పు. అట్టివారియందే మతము హెచ్చుగ బట్టుపడియుండును. మతమునకును ప్రార్థనాది కర్మములకును సంబంధము లేదు మతములో ప్రార్థనాది కర్మములు వేఱు కారణంబుచే జేర్చబడినవి. అడవినరునకు మతమన నేమో తెలియకయుండినను వాడొకానొక కష్టసమయమున, హా! శక్తీయనియో హా! దైవమాయనియో యఱచును. అట్టి కష్టసమయమున మఱియొకడు "హా తండ్రీ" నన్ను గష్టమునుండి తప్పింపుమని ప్రార్థించును. వారికినది యేమతము. "నేను పాపిని నన్ను రక్షింపుమని" యంగలార్చుట యొకమతము. ధేల్సు జాతివా రెట్టి వస్తువునందును దైవభావముంచుచుండిరి, బౌద్ధులెందును దైవమే లేదని వాదించిరి, వీరిరువురును దమతమ మతాభి

మాటియొక సవితృని గుఱించినస్తుతి, సకలురునేర్చి దినదినమును బఠింపఁ

(3) "ఆలోచనలేకనైనను, మానస చాంచల్యము చేతనైనను, గర్వము వల్లనైనను, మానవ సహజగుణముచే నైనను, మేమెపుడయిన దైవ విధులకు భంగముగ నటించితిమేని, సవితృా! దైవములయెదుటను, మానవులయెదుటను, మమ్మునిచట నిరపరాధులుగ నొనర్పుము"

(2) "సవితృ" భూమినిఁ బాశములగట్టెననియు, స్వర్గము నే కంభ సాహాయ్యము లేక నిలిపెననియు, తెలుపఁబడినది.

(5) సవితయొక్కఁడే ప్రపంచమునేలును.

(4) సవితచే నభిరక్షింపఁబడిన విధులు భద్రముగనిలిచినవి.

(3) సవితృమహిమ దైవములు నుతించుచున్నారు.

(2) సవిత దైవములకు నమర్త్యత నిచ్చుననియు, మానవులకు ప్రాణ దానము లిచ్చువాఁడనియు, నుతింపబడెను.

సవితృ, స్వర్ణమయుఁడు, స్వర్ణచక్షువులు, స్వర్ణకరములు, స్వర్ణభుజ రథములుగలిగి ధూళిలేనిమార్గమున సంచరించును" అని వర్ణింపఁబడినది. ీస్సంధ్యాకాలమునందలి సూర్యరూపమునకు సవితృనామమని తెలియ ు. సవితయొనరించు పనులలో నత్యంతముఖ్యమగుపని నీక్రింద వివ క్తములోఁ దెలుపఁబడినది.

[2] వాయులోకముగుండ నిచ్చటికివచ్చుచు మర్త్యులకు నమర్త్యులకు విశ్రాంతినిచ్చుచు, భూతకోటినిఁ జూచుచు, స్వర్ణరథము నెక్కి మమ్ము సమీపించుచున్నాఁడు.

[7] సూర్యుఁడిపుడెచటనున్నాఁడు? ఎవరికిఁ దెలుసును? ఏస్వర్గముపైన వానికిర ణములిపుడు వ్యాపించుచున్నవి?

[9] భూస్వర్గములమధ్యఁ దానొనరింపఁదగిన పనులొనర్చుచు, బాధలు నివారించుచు, నంధకారంబునడఁచుచు స్వర్గమునకుఁ బోవుచున్నాఁడు.

పైఋక్కులలో నిప్పటివారొక విశేషవార్తను దెలియఁదగినదిగనున్నది. ానవమున సూర్యుఁడు సముద్రమునఁ బడిపోవునను దురభిప్రాయమిప్పటికి ారికిఁగలదు. సూర్యుఁడు రాత్రి పశ్చిమమునుండి తూర్పునకు రెండవఖండమున

సంచరించుచుండుననియు సవిత వానికిఁబురోగామిగ నుండుననియు రెండవ ఖండమువారికి మనపశ్చిమము తూర్పుగనుండుననియు ప్రపంచమారూపముననే యుండుననియుఁ దెలియవచ్చుచున్నది. ద్వాదశాదిత్యులకు సూర్యశబ్దము సామాన్యముగనుండునని తోఁచుచున్నది. సవితనుగుఱించి మఱియొకబుక్కునఁ గొన్ని విశేషాంశములున్నవి.

2. ౩౮. [2] సవితృ బలమైనదైవము. తనకరములు భుజములు నాకాశమునకుఁ జాచెను. అచ్చటివస్తువులు వానివశమాయెను. జలములు వాని యాజ్ఞలోఁబడెను. మారుతము వానికిలొంగెను.

[3] తనకు విశ్రాంతిలేనటుల గుఱ్ఱములనుదోలి పిదప వానిజీనులుదీసి పథికులకు విశ్రాంతినిచ్చెను. గరుత్మంతుని వేగమునణఁచెను. దయాళువగు సవితృ వాజ్ఞానుసారముగ నంధకారమువచ్చును.

[4] నేతకాడు తననేత వస్త్రమునుజుట్టెను. పనివాఁడతనిపని మధ్యనే వదలెను. ఈదైవము కాలవిభజనఁ జేయుచున్నాఁడు. సవితృ దైవమునకు విశ్రాంతియే లేదు.

[5] మర్త్యుఁడువసించు ప్రతిగృహమునకు గృహదీపము తనతేజమును దూరముగ వ్యాపింపఁజేయుచున్నది. తల్లి కొమారునకు నన్నము పెట్టుచున్నది. దైవము జనులకు నాహారాపేక్ష పుట్టించుచున్నాఁడు.

[6] ధనార్జనకు వెలికివెడలినవాఁడు మఱల గృహముఁ జేరును. దూరముగఁ బ్రయాణమయి పోయినబాట సారిమనము తనయింటిపై నుండును. ప్రతియొకఁడును తనపని యర్ధమయియుండినను ధనగృహముఁ జేరఁ బ్రయాణమగును. ఇదియే దైవసంకల్పము.

[8] చాంచల్యము గలిగినట్టియు గంతులువేయునట్టియు చాప సాయంత్రి యయినతోడనే తనకు జలములో సరళమగుస్థళమును వెదకికొనును. పక్షులెల్లఁ దమగూళ్లువెదకును. పశువులు తమదొడ్లవెదకును. దైవము ప్రాణకోటి నీరీతినుంచినాఁడు.

పై బుక్కులు పాశ్చాత్యపండితులు మెచ్చినారు. ఇట్టివిషయముల నిదే రీతిగ బైరన్‌యను కవిడాన్‌జ్యుయన్‌కాంటో ౩. 107-వ భాగమున వర్ణించినాఁడు.

మఱియొకబుక్కున సవితృ ప్రజాపతియనియు విశ్వకర్మయనియు ననేకరూపములు గొనినవాఁడనియు వర్ణింపఁబడినాఁడు.

3. 55. [19] త్వష్ట్ర సవితృ విశ్వరూపములుధరించి జీవకోటినిఁ బుట్టించి రక్షించుచున్నవాఁడు. జీవకోటి వానికిఁజేరినది. వాఁడు ప్రపంచ పాత్రలు రెండునిర్మించెను. వానిలోనెల్లఁ దనతేజమునించెను. పైవర్ణనలు చూచినచో సూర్యుఁడును సవితృ నొకరయినను సవితృ రూపమందిన దైవమే సర్వారాధ్య డన్యోననియు తత్కారణంబు ననే గాయత్రీమంత్ర మహాదైవమునుగుఱించి విశ్వామిత్రులు రచించిరని తెలియవచ్చుచున్నది. సూర్యుని సవితృరూపమునందు ప్రాణవాయువునిచ్చు గుణమున్నదికావున నాదైవము నింతగ వర్ణించినారు. ఈ సవితృదైవమే దైవములలోనెల్ల హెచ్చుదైవ మని ప్రాచీనఋషులెన్ని దినదినమును దాముప్రార్థించు గాయత్రీ మంత్రము సవితనుగుఱించి రచించిరి.

2. [10] దేవాగ్రగణ్యుఁడగు సవితృ యొక్కయశఃప్రకాశమును మేమందు నటులాదైవము మామానసముల బోధింపనిమ్ము. పైమంత్రమునే ప్రణవాక్షరముఖ్యముగ నార్యులిపుడును త్రికాలములందు జపించు చుందురు. వేదఋక్కులకెల్ల నిది శిరోరత్నమని భావించినారు.

సూర్యునకు మిత్రుఁడని యొకపేరున్నది. స్నేహితునిబలె జనులకు రమిడి పోషించుచుండునని యర్థము. మిత్రావరుణు లిరువురు స్వర్ణరథమెక్కి కాలము సంచరింతురనియు సాయంకాలము తమరథమునకు నినుపకాడ మరనియు.

2. (8) లోఁ బలుకఁబడినది. ఇనుమెల్లెడల నినుమును సూచించును. సాయం కాలమున నంధకారవ్యాప్తిచేఁ గాడిమాను నల్లనగునని తెలిపినారు.

సూర్యునకు మధ్యాహ్నకాలమున విష్ణువని పేరు. విష్ణునామము సూర్యుని గాన్యనామమని కొందఱు వచించిరి.

2. (17) లో ప్రపంచమంతయు విష్ణువు సంచరించెను. ప్రపంచమును మూఁడుపాదములచే సంచరించెను. అనఁగ నాకాశాంతరిక్ష భూము లందుఁ గిరణములు వ్యాపింపఁజేసెనని భావము. ఈ ఋక్కులలో నైనను విష్ణువునుగుఱించిన మఱియే ఋక్కులలోనైనను, పురాణ గాథలలోఁ బలుకఁబడిన రీతిగ విష్ణువవతార పురుషుఁడనికాని, ముఖ్యదైవమనికాని ఋగ్వేదమునఁ బలుకఁబడలేదు. ఐతరేయ బ్రాహ్మణములోను (6. 15) శతపద బ్రాహ్మణములోను (1.2-5)

విష్ణువు సంచరించినంత ప్రపంచమునుగుఱించి వ్రాయఁబడినది. శతపథ బ్రాహ్మణములో (14-1-1) తుదిభాగమున విష్ణువు సర్వోత్తమదైవమని స్థాపించినదిచూచి యింద్రుఁడాదైవము తలఁ గొట్టెనని చెప్పఁబడినది. ఛాందోగ్యోపనిషత్తులో ఘోర ఆంగ రిసుల శిష్యుఁడు కృష్ణుఁడని పలుకఁబడినది. ఇంద్రుఁడు విష్ణువును దలనఱికెననిన మాధ్యాహ్నకాలమునందు విష్ణువు తలయెత్తి యాకాశమధ్యమున నుండును. మధ్యాహ్నసమయము మీఱినతోడనె పశ్చిమమునకు వాలును. పశ్చిమ మస్తమించుదిశ కావున విష్ణువు యొక్క తల నిక్కుతగ్గెను. తత్కారణంబున నింద్రుఁడు విష్ణువు తలనఱికెనని పలికినారు. ఋగ్వేదమున విష్ణువునుగుఱించిన కొన్ని ఋక్కు లిచటవ్రాసెద.

M. 1. 154. (1) భూమి నలుదిశలును సంచరించిన విష్ణువుయొక్క సాహసకర్మములు నేఁ బలికెద. స్వర్గమునందలి దేవసభలో నున్నతప్రదేశమందెను. మూడుతూరులు తన పదములు విశాలముగనుంచెను.

(2) ఇది తన గొప్పకార్యమని విష్ణువు నుతించుకొన్నాఁడు.
వాని మూడుపాదముల ప్రదేశములో జీవకోటియెల్ల యున్నది.

(3) ఈ ఋక్కు విష్ణువుకు బలముగ, నున్నతప్రదేశముఁజేరని

(4) ...వాఁడొక్కఁడే భూమ్యాకాశములును జీవకోటినిఁ బట్టినాఁడు.

(6) గుండుచక్రముఁబలె నాలుగుగుఱ్ఱములతోఁ దొంబయి పందెము గుఱ్ఱములను బఱిగిడవిడిచి యతిత్వరితముగఁ బోవుచున్నాఁడు.

మూఁడులోకములు విష్ణువువ్యాపించి ప్రకాశింపఁజేయునది విదితము. ఇఁక నాలవఋక్కుయొక్క యర్థమేమన, సంవత్సరమునకు నాలుగు ఋతువులనియు నొక్కొక ఋతువుకుఁ దొంభదిదినములనియు నాలుగుఋతువులకు మూఁడువందల యఱువదిదినములనియు విష్ణువు వీకాలమెల్లను సంచరించుచుండుననియుఁ దాత్పర్యము.

7. 99. (1) విష్ణూ! మేరమీఱినరీతిగ నీవు నీ దేహప్రకాశమున హెచ్చయినస్థలమును మానవులు చేరలేరు. నీకుఁజేరిన రెండులోకములును మేమెఱుంగుదుము. దైవమా! మూఁడవలోకమును నీవే యెఱుంగుదువు.

(2) పుట్టినవాఁడుగాని, పుట్టఁబోవువాఁడుగాని, నీ యత్యున్నత ప్రకాశ

ప్రదేశమునుఁ జేరలేరు. భూమియొక్క పూర్వాదిశాంతములను భద్రముగ బంధించి యాకాశమును గుడారమెత్తి పట్టినావు.

7\. 101. (4) బలమగు పాదములచే విష్ణువీ భూమిని సంచరించి మనువుయొక్క మందిరమును స్థిరపఱచెను. ఋగ్వేదమున విష్ణువునుగుఱించి పలికినపుడు పలుతావులందు మఱియొకదైవము నా నామమునకు జంటింపఁబడినది. పాదములచే మూఁడులోకములు వ్యాపించువిషయమొకగాథనుఁ గల్పించి త్రివిక్రమావతారమని పేరిడిరి. ఆ గాథయందలి వామనుఁడదితికుమారుఁడేను. సూర్యుఁడుసైత మదితికొమారుఁడు. పాపరూపమును భూమినుండి పాతాళమునకుఁద్రొక్కి జనులకు స్వర్గద్వారముఁజూపెనని రహస్యార్థము. పాదమనఁగఁ గిరణము. విష్ణువగు సూర్యుఁడు మధ్యాహ్నకాలమునఁ జిన్నరూపమును వహించి మూఁడుకిరణములు స్వర్గమర్త్యపాతాళలోకములలోవ్యాపింపఁజేసెనని భావము. వామనుఁడనఁ జిన్నవాఁడనియర్థము. ప్రకృతిఁసహజచర్యలను గాథలుగఁగల్పించి నిజమగువార్తలుగఁ బురాణములువ్రాసి జనులను దప్పుదారిఁ ద్రొక్కించిరి. సూర్యునకుఁ బూషణుఁడని మఱియొక నామము. ప్రారంభమునఁ బూషణుఁడు విశేషాధికారము కలవాఁడుగ నగపడలేదు. కురుబవారి దైవముగనుండెను కావున నీ దైవము రథాశ్వములు, మేకలు, పశుసాధనియను నాయుధము హస్తమునఁ గలవాఁడయి యుండెను.

M. 6. 53. (9) } లో స్వర్ణమునఁ జేయఁబడిన చిన్నకత్తికలవాఁడని పలుకఁబడినది.
M. 1. 42. (6) }

పూషణుఁడు వ్యవసాయదైవముగఁ బ్రారంభమున నుండెను. పిదప మర్త్యులకంటె హెచ్చనియు దైవములకు సమానుఁడనియుఁ బలుకఁబడెను.

6\. 48. (9) ....ఈరీతిగ నున్నవాఁడు చరాచర ప్రపంచాధిపతి.

1\. 89. (5) ....సవితృవిధమున సర్వమునుఁ జూచువాఁడు పూషణుఁడనియు

10\. 17. (13) జనిపోయినవారి యాత్మను పితృలోకమునకుఁ గొనిపోవువాఁడనియు వర్ణింపఁబడినాఁడు.

దున్ను నాగేలును రక్షింపుమని పూషణుని ఋషులు ప్రార్థించుచుందురు. పశువులను రక్షించుచు, దప్పించుకొనిపోయిన పశువులను వెదకి చిక్కఁజేయు

చుండు దైవము పూషుఁడని భావించిరి. మృగాదులనుండి వచ్చు నపాయములు రానటుల రక్షింపుమని యార్యులు పూషుని వేఁడుచుండిరి. దాఁపఁబడిన ధనమును గనుఁగొనుటకుఁ బూషుఁడు ప్రార్థింపఁబడును. జను లేవస్తువునైనను బోఁగొట్టికొని యుండిన యెడల వానిని వెదకుటలో సాహాయ్యపడువాఁడు పూషుఁడేను. పథికులకును వ్యవసాయికులకును పశువులమందలు గలవారికిని సాయము జేయువాఁడు పూషుఁడేను. పథములస్వామియని పిలువఁబడుచున్నాఁడు. దారులేర్పఱుపుమనియు దారులందు శత్రువులును దొంగలును బాధింపకుండునటుల రక్షింపుమనియు పూషునిఁ బ్రార్థింతురు. పూషుఁడు ప్రాతఃకాలమున సూర్యుఁడు కావుననే

6. 55. (4-5) లో పూషుఁడు చెల్లెలను మోహించినవాఁడనియుఁ దల్లిని వరించిన వాఁడనియుఁ బలుకఁబడినది.

పూషుఁడు నుషస్సు నిరువురు నాకాశమునకు బిడ్డలు కావునఁ బూషుఁడన్న, ఉషస్సు చెల్లెలు. పూషుఁ డించుక రాత్రియుండగనె పుట్టును. కావున రాత్రికిఁ గొడుకాయెను, పూషణోదయముతోడనె "రాత్రి" సిగ్గుచేఁగాఁబోలు దాచికొనును. కావున "రాత్రి" పూషునకు భార్యగ నేర్పడెను.

సవితృ సూర్యులుగాక సౌరదైవములలో మిక్కిలి ప్రసిద్ధికెక్కి ఋగ్వేదమునందు పలుతావుల వచ్చువా రింద్రావరుణులు. వీరి జనన మహిమలు దేహసామర్థ్యము రాజ్యముసాధింప వీరిరువురికిఁ గలిగిన ద్వేషము ఋగ్వేదమునందు వివరింపఁబడినది. ఆ విషయముఁ దెలిసి నంతవరకు సంక్షేపముగ నిందువ్రాసెద.

ప్రాచీనార్యులు, మూఁడులోకముల నేలు రాజువరుణుఁడని భావించియుండిరి. ఈ వరుణశబ్దార్థ మేమయినదనియు వరుణుఁడెటు దేవశ్రేష్ఠుఁడయి యుండెననియుఁ బ్రారంభమునఁ దెలియఁజేసెద. ఆకాశభూములందుఁగల చరాచర వస్తువులు వానినడుమఁ జిక్కికొనియుండినపుడు మిద్దెకప్పుబలెను గుడారము (Tent) బలె నుండెననుట స్వాభావికముగ నందఱుఁ దెలియఁదగినవర్ణన. అనఁగ భూమి భవనప్రదేశముగను నాకాశ మాయింటిపైఁ గప్పుగను నుండెననిభావము. అట్టి పైఁగప్పునకు సరియయినశబ్దము వరుణమనిరి. ఆమహచ్ఛబ్దవిశేష్యములను మహత్సబ్దములుగ నొనరించి నామములిడుట యార్యుల స్వభావము. కావున వరుణశబ్దము వరుణుఁడయ్యెను. "వృ" యను ధాతువునకుఁ "గప్పుట" యని యర్థము. "వృ" యను ధాత్వర్థము మహచ్ఛబ్దముగమారి, వరుణుఁడను పురుషుఁడయ్యెను. ఆకాశము దైవములకెల్ల జననస్థానమయి పూజ్యతనందెను కావున,

వరుణుఁడును దేవపూజ్యుఁడయ్యెను. కావున రాజయ్యెను. దివియన నాకాశము
ఆకాశము కాలనక్షత్రగతులకును ఋతువిధులకు నాధారపడియుండినందున వరుణు
నకునా పదవివచ్చెను. ఈరీతిగ సామాన్య శబ్దములర్థవిశేషమున దైవములయ్యెను.

M. 8. 41. లో, వరుణుఁడు గోవులను రక్షించువిధమున జనులతలంపులు రక్షించు
ననియు, ప్రపంచము నంధకారముచేఁగప్పి ప్రాతఃకాలమున విప్పునట్టి
యైంద్రజాలకుఁడనియు, సకలదైవములు వానివిధులకు లోఁబడినవా
రనియు, త్రిసంధ్యలనువాఁడు ప్రియముగఁ జూచువాఁడనియు, నాలుగు
దిశలు నేర్పాటుచేసెననియు, తనప్రయాణమునకుఁ బ్రారంభప్రదేశము
ప్రాగ్దిశగ నేర్పఱచెననియు, ప్రాణకోటిని రక్షించువాఁడనియు, ప్రాతః
కాల కిరణముల రహస్యనామములఁ దెలిసినవాఁడనియు, జ్ఞానరూపుఁ
డనియు నన్నిదిశల బట్టవలెఁజుట్టువాఁడనియు, దూరదృష్టిని మూఁడు
లోకములనుజూచుచు పైనుండు లోకత్రయము నిండినవాఁడనియు,
పురాతనలోక సింహాసనమును స్థాపించి, రెండులోకములను విడినీసి
జననరహితుఁడై స్వర్గమునుఁ గాపాడువాఁడనియు తెలుపఁబడినది. వరుణ
శబ్దము ప్రథమమున నాకాశమై కొంతకాలమునకు వరుణుఁడను పురు
షుఁడయి యాకాశరాజాయెను కావున యాకాశ చిత్రమహిమలు
వరుణునకువచ్చెను. ప్రాపంచకసృష్టులకును నీతివిధులకును గర్తయయ్యెను.
సూర్యచంద్రులు వరుణునిలోచనములైరి. ఒకబుక్కులో సూర్యుఁడు
వరుణుని స్వర్ణాశ్వమని పలుకఁబడినది మఱియొకబుక్కులో సూర్యుఁడు
వరుణుని స్వర్ణపర్ణపక్షియని పలుకఁబడినది. మఱియు వరుణుఁడు భూమి
లేనిప్రదేశమునఁ జెట్టును తలక్రిందుగ నిలిపి వేఱులభాగము పట్టుకొని
నాఁడని వచించినారు. వేరుభాగము సూర్యుఁడనియు, శాఖలు సూర్యుని
కిరణములనియు, నార్యుల యభిప్రాయము. భూమ్యాకాశముల మధ్య
నుండెడి యంతరాళమునకు రోదసియనిపేరు. ఈ రోదసియందే మేఘ
మండలము వాయులోకములున్నవి. దీనికి నంతరిక్షమని పేరు. ఈయంత
రిక్ష మార్గములోనే వాయువులువీచునది. మేఘములు గూడునది.
మేఘమండలము జలమయమయి దేవగణ సముద్రమయ్యెను. ఇదియే
క్షీరసముద్రమని ప్రఖ్యాతికెక్కెను. మేఘము లావులనియును వాని
పాలు క్షీరములనియును నార్యులలంకరించి నామములిడిరి. వీనికెల్ల

నధికారి వరుణుఁడేను. ఈ విషయమునుగుఱించిన ఋక్కు లనేకము లున్నవి.

M. 5. 85. [1] గంభీరోన్నత పదములచే మించిన యొకఋక్కును, చక్రవర్తియగు వరుణుని యుపకృతినిఁ దలంచుచుఁ జూదుము బలిపశువునుఁ బడవేసిన విధమున భూమినిఁబడవేసి చర్మమునుబఱచినరీతి సూర్యుని యెదుటఁ బఱచినాఁడు.

[2] వృక్షములపైన గాలివీచుచున్నాఁడు. గోవుల పొదుగులలోఁ బాలు నించినాఁడు. గుఱ్ఱములకు జవసత్వములిచ్చినాఁడు. మానసములకు బుద్ధి బలిమి నిచ్చినాఁడు. నీటిలో నగ్నినుంచినాఁడు ఆకాశమున సూర్యునినిలిపినాఁడు. పర్వతములందు సోమలతను బెంచినాఁడు.

[3] మేఘపాత్రను దలక్రిందుచేసి భూమ్యంతరిక్షాకాశములకు నీరిచ్చుచున్నవాఁడు. భూములుతడపి ఫలము లిచ్చుచువాఁడు. క్షీరబలులను గోరినపుడు భూమ్యంతరిక్షాకాశములందు వర్షముగుఱిపించి, పర్వతములను మేఘములలోముంచి బలశాలురగు మరుత్తులుసైతము నడవ నలసటఁ గలిగించుచున్నవాఁడు.

(7) మమ్ము ప్రేమించు వానికినైనను, సోదరునకునైనను, మిత్రునకునైనను సాహాయ్యకారికినైనను, నిఱుఁగుఁ బొఱుఁగువారికినైనను పరదేశికినైనను బాపముఁదలఁచియుంటిమేని, వరుణా, యాపాపము మా నుండి తొలఁగింపుము.

(8) జూదములందు, ద్యూతకారులబలె, మేము మోసమొనర్చియుండినను, తెలిసియో తెలియకనో యేదయినను దప్పొనర్చియుండినచో సంకెళ్లను వదల్చినరీతి నా పాపములు వదల్పుము. మమ్ము మీ ప్రేమాస్పదులఁ జేసికొనుము.

M. 7. 87. (1) సూర్యగమనమునకు మార్గము వరుణుఁడేర్పఱిచెను. నదుల నీటి పాఱుదలకు దోవలుగల్పించెను. పందెము గుఱ్ఱములను నొక్క మార్గమునఁ దీసికొనిపోవురీతిగ దినగమనములకు మార్గమేర్పఱిచితివి.

(2) నీ శ్వాసరూపమగు వాయువు, క్రూరమృగ మటవిని ధ్వనించుచు సంచరించినరీతిగ నలుదిక్కుల సంచరించుచున్నది. భూమ్యాకా

శమునందలి ప్రాణికోటినంతయు నీవు ప్రేమముగఁ జూచుచున్నావు.

M. 1. 25. (7) ఆకాశమున సంచరించు పక్షులమార్గములెల్ల, వరుణా! నీవు తెలిసినావు. సముద్రముల రాజువు నీవు. సముద్రములపై సంచరించు నావల మార్గములెల్లఁ దెలిసినావు.

(8) ఋతువిధుల ననుసరించు ద్వాదశమాసములును వానిపిల్లయగు నధికమాసమును నీవెఱింగితివి.

(9) వాయుసంచార మార్గములును నీవు తెలిసితివి. స్వర్గమునందలి దైవములనెల్లఁ దెలిసినవాఁడవునీవు.

ఎనిమిదవఋక్కునకు సంబంధించిన విధులే ఋతువిధులు. సూర్యచంద్ర నక్షత్రాది గ్రహగమనములను నహోరాత్రముల మార్పులును ఋతువుల రాకపోకలును మేఘములు జలగర్భితములగుటయునుఁ బ్రసవించుటయును నిత్యాదులేవిధములగు మార్పులులేక శాశ్వతముగనుండు ప్రకృతిసంబంధ చిత్రమహిమలు. ఈ ఋతుధర్మముల కధికారియై కాపాడువాఁడు వరుణుఁడు. పాపములను దొలఁచువాఁడు వరుణుఁడు కావున జనులెట్టి పాపమొనర్చియుండినను నా పాపఫలమునుండి తమ్ముఁగాపాడుమని వరుణుని వేఁడుచుందురు. వశిష్ఠునకును వరుణునకును మొదట స్నేహముగనుండి పిదప విరుద్ధము వచ్చినందున వశిష్ఠుఁడు రోగిష్ఠియయ్యెను. అక్కారణంబున వశిష్ఠుఁడు వరుణస్తుతి యొనర్చెను. ఆ స్తుతులే యేడవమండలంబున విశేషముగ నున్నవి.

7. 88. (5) వరుణా! మే మిరువురము మిత్రులమయి సంచరించుచున్న పూర్వస్నేహము మఱచితివియా? ఆ మైత్రి యెచటఁబోయెను? అక్కాలమున నీయొక్క సహస్రద్వారమందిరములో నేఁ బ్రవేశించుచుంటినిగదా?

(6) నీకుఁ బ్రేమాస్పదుఁడయి యుండిన మిత్రుఁడు నీకేరీతిగనైనఁ దప్పొనర్చియుండినచో, పవిత్రుఁడగు వరుణా! ననుశిక్షింపకుము. కవికి రక్షకుఁడుగ నుండుము.

7. 85. (2) ఎటు వరుణునితో మఱల నేఁ గలసియుండుదునని నా మానసమున నేనే యాలోచించుచున్నాను. అతని యనుగ్రహమునందు నేనేమి సమర్పింతును. దేనిచే నతఁడు తృప్తినందును. అతఁడు సుముఖుఁడయి యనుగ్రహ సూచక ముఖము గలవాఁడయినది నేనెపుడు చూడఁగలను?

(3) నా యొనర్చిన పాపమేమయి యుండునది తెలిసికొనుటకయి వరుణా! నేను జ్ఞానుల సరసకుం బోతిని, వారినడిగితిని, జ్ఞానులెల్లరు నేకవాక్యతగ వరుణునకు నాగ్రహము కలిగించినావని పలికిరి.

(4) వరుణా! నా నేరమేమి? నిన్నుం బ్రార్థించు మిత్రునిం జంపనగునా? అజేయుండగు స్వామీ! నా తప్పేమయినదిన్ని తెలుపుము? నేను నీకు విధేయుండనయి నిన్నుం బూజించి పాపరహితుండనయ్యెద.

(6) మమ్ము దారితప్పించినది స్వబుద్ధికాదు. పరబుద్ధి. అవివేకము, మద్యపానము, జూదము, కోపము, ఇవి మా బుద్ధులం జెఱచినవి. వృద్ధులు పిల్లవారిని దారితప్పించిరి. నిద్రసైతము చెడుకార్య ఫలము మాన్పదు.

7. 89. లో వసిష్ఠఋషి వరుణుని కృపం గోరుచున్నవాండు.

(1) వరుణరాజా! నన్నిపు డింకం జావనియ్యకు. స్వామీ! నన్నుం గృపం జూడుము.

(2) వాతాహతమై చలించుమేఘమువలె నేను వడంకుచుం బోవుతటి, స్వామీ నన్నుం గృపంజూడుము.

(3) సర్వశక్తిగల దైవమా! అశక్తతచే నేనేతప్పు నొనర్చియుండినను స్వామీ! నన్నుం గృపంజూడుము.

(4) నీటి ప్రవాహామధ్యమున నీ భక్తుండు నిలిచియుండినను తప్పిపోదయ్యెను స్వామీ! నన్నుం గృపంజూడుము.

(5) మానవులగు మేము దైవములకు నెంత ముంతొనర్చియుండినను నాలోచనారహితులమై నీ న్యాయవిధులకు నేభంగ మొనర్చియుండినను స్వామీ! యా తప్పునకునై మము శిక్షింపకు కృపంజూడుము.

వరుణుని ననేకసూక్తములలో మిత్రునిం జేర్చి జంటగ స్తుతించినారు. సూర్యుని ప్రకాశరూపము మిత్రుండు. వరుణుండన నాకాశము. మిత్రావరుణులనం బ్రకాశరూపమగు నాకాశమని యర్థము. మిత్రుం డైరాణులకు సైతము దైవముగ నున్నవాండు. మిత్రావరుణు లిరువురు జంట దైవములుగం బ్రార్థింపం బడినను, మిత్రుండు ప్రాతఃకాలమున జనులను నిద్రలేపి వారివారి పనులకుం బంపువాండని 3. 59. సూక్తములోనున్నది కావున మిత్రుండు ప్రాతఃకాల దైవమనియును వరుణుండు రాత్రిదైవమనియును గొందఱభిప్రాయపడినారు. అనేకఋక్కులలో మిత్రావరుణులు రాజులనియు ఋతువిధులను గాపాడువారనియుం బుణ్యస్వరూపకులనియు

పాంచశిక్షకులనియు నుండినను జంటగనుండిన మిత్రుఁడు కొంతకాలమునకు దైవ మయ్యెను. వరుణుఁడు వెనుకకుఁజిక్కి కాలాంతరములపై హీనదశనందెను. సర్వ ప్రపంచాధికారిగనున్న వరుణరాజు జలాధికారిగ నిలిచెను. వానికిఁగల దైవశక్తులను దప్పించిరి. వరుణునుండి లాగఁబడిన పదవు లింద్రునకు నవీనముగ నారోపించిరి. పాతదైవము పడిపోయెను నూతనదైవముయొక్క విజృంభణము బలమాయెను. పూర్వఋషులచే వర్ణింపఁబడిన వరుణునం దేకళంకమును జూపఁబడలేదు. అయినను ఋగ్వేదకాలముననే వరుణుని యధికారమునుగుఱించి వాదముసంభవించి ఋషులు రెండుకక్షులవారుగ నేర్పడి తుదకు వరుణుని రాజ్యాధికారపదవి నింద్రుఁడందెను. ఇటులనే వరుణుని యధికారము చలించుచుఁ దుదకు వరుణుఁడొకదిశకు నధికారిగ నేర్పడెను. ప్రారంభమున వరుణశబ్దమునకుఁగల యర్థ మిక్కాలమున నే మూల డాఁగెనో తెలియరాదు.

ఐరానీల మతములోసైతము మిత్రావరుణులు జంటదైవములుగ వాడఁబడినారు. యాశ్నా 1. 11-లో "అహుర-మిత్ర" ప్రీత్యర్థ మొనగింపఁబడు నాగమ విధులలో నా స్తుతుల సాహాయ్యమున "అహుర-మిత్రుల" సమీపింతునని యున్నది. వారిరువురు పావనమూర్తులయి యున్నతపదవి నుండువారు. పైన పలుకంబడిన "అహుర" యను నామమునకు నర్థము వరుణుఁడు. అహురయను నామము సురయను శబ్దముయొక్క మార్పు. అసురశబ్దము ప్రథమమునఁ "ప్రాణము నిచ్చు" ననెడి యర్థమిచ్చుచుండెను. పిదపఁ బ్రాణము నపహరించుననెడు నర్థమునకు మారెను. రెండవయర్థమునుఁబట్టి యసురశబ్దము రాక్షసవాచక మయ్యెను. వరుణుఁడు రాక్షసరాజాయెను. ఐరానీలుమాత్ర మా దైవమునకుఁ బదచ్యుతిఁగలుగ నియ్యక ప్రారంభమునుండి దైవముగనె పూజించుచున్నవారు. ఆర్యులదైవము లైరానుల రాక్షసులైరి. ఐరానీల దైవము లార్యుల రాక్షసులైరి. ఇంద్రునకు స్వర్గాధికార మొసఁగు వాదములలో శబ్దములకు వచ్చిన యాపదలివి.

ఏడవమండలములో వరుణునిగుఱించి వశిష్ఠుఁడొనరించిన స్తుతుల సమానలసమానములుగనున్నవి. దైవభక్తులు సదా పఠింపఁదగినవిగ నున్నవి. వరుణేంద్ర వ్యవహారవాదమునుగుఱించిన ఋక్కులుకొన్ని యుదహరించి పిదప నింద్రుని విషయము వ్రాయఁబూనెద.

వరుణుఁడు తనకు రాజ్యపదవి జననాదిగ బహుకాలముగ వచ్చినదనియు దానినిఁ దానువదలనని వాదించెను. ఇంద్రుఁడు తనకుఁగల బలమునుబట్టి రాజ్యము తనకు రాఁదగినదని కోరెను. అపుడు వరుణుఁడు పలికినదేమనినః—

M. 4. 42. (1) నేను రాజుగ నేలువాఁడను. రాజ్యము నాయది. ప్రాణకోటిని (మర్త్యులను నమర్త్యులను) నేలువాఁడను నేను. మనుజప్రపంచ భవనమునకుఁ బైఁ గప్పుగనుండు నాకాశమునకు నేను రాజును.

[2] నేను వరుణరాజును. అనాదిగనుండు దైవికోన్నత శక్తులు నా యందున్నవి. దైవములెల్ల నా యాజ్ఞ ననుసరించి నాకు విధేయులుగనున్నవారు. ప్రపంచముయొక్క పైఁగప్పగు నాకాశమునకు రాజును నేను.

[4] ఆర్ద్రతనిచ్చు జలము ప్రవహించురీతిగ నే నొనర్చితి. ఋతువిధులనుసరించి యాకాశమును భద్రముగ నిలిపితి. అదితిపుత్రుఁడగు నేను ఋతువిధుల ననుసరించి ప్రపంచమంతయును మూఁడుభాగములుగ నొనర్చితి.

ఇంద్రుఁడు పై మాటలువిని బదులిడిన విధ మేమనిన:—

[5] యుద్ధసమయములం దశ్వారోహకులును, యుద్ధవీరులును, నా సాహాయ్యముఁ గోరుచుందురు. మఘవానుఁడగు నింద్రుఁడు నేను జనులను యుద్ధములకుఁ బ్రేరేపించుచున్నాను. అసమాన బలవంతుఁడు నేనయి ధూళిని రేచుచున్నాను.

[6] ఇవి యన్నియును నే నొనర్చు సాహసములు. దైవముల శక్తులన్నియుఁ గూడినను నన్నెదిరింపఁజాలవు. స్తుతులును సోమరసమును నన్ను సంతోషపఱచినపుడు రెండులోకములున్ను నాకు భయపడుచుండును.

పైన వివరించిన యుభయవాదములును విని యీ సూక్త మొనర్చిన ఋషి యుభయులు రాజులని తీర్మానించి యుభయులను స్తుతించినాఁడు. ఈ ఋషి త్రసదస్యుఁడను రాజు, పురుకుత్సుని కొమారుఁడు.

పైన వివరించిన వాదములుజరిగి తుదకు నింద్రునకు రాజ్యపదవినిచ్చిరి. అయినను వరుణుని పరముగ నుండిన కొన్ని దైవము లింద్రుని యధికారమునకుఁ బ్రారంభమున సమ్మతింపక దినక్రమముగ నొక్కొక్క రింద్రునిపరమైరి. వరుణుఁడు రాజ్యచ్యుతుఁడయ్యెను. రాక్షసుల రాజాయెను. దైవము లింద్రునిపరమయిన ఋక్కులును నీ వాదమును గుఱించిన ఋక్కులును బదియవమండలములో 124 సూక్తమున నున్నవి. వానిలోఁ గొన్ని యీక్రింద వివరించెద.

27116
28.3.73

10. 124. (1) అగ్నీ! మే మొనర్చు నాగమవిధికిరమ్ము. ఈ యాగమవిధినిఁ ద్రికాలములందును, నేడుగురు ఋషులచేతను నైదుభాగములుగ నొనర్తుము. మాకుఁ బురోహితుఁడుగనుండి హవిర్భాగములు దైవములకుఁ గొనిపొమ్ము. నీవు బహుకాలమునుండి యంధకారముఁ జేరినావు.

(2) దైవానుగ్రహములేని యంధకారమున బహుకాలమువసించి యిపుడు మిముఁజూడవచ్చుచున్నాను. మర్యాదనువీడి, గొప్ప దైవమును వదలి, మిత్రద్రోహియైన వానినిబాసి నూతనదైవమునుఁ జేరెదను.

(3) అనార్యుల యతిథినిఁజూచి నే ననేకాగమవిధులకుఁ బోవకనిలిచితిని. ఆర్యుల తండ్రియగు గొప్పదైవమునువదలి యనార్యులచేఁ బూజింపఁబడు దైవమునుఁ జేరెద.

(4) బహుకాలము వరుణుని యారాధనలోనుంటిని. ఇపుడా తండ్రిని వదలి యింద్రునిపరముఁ జేరెద. సోమునితోఁగూడి వరుణుని వదలెదను. రాజ్యములుమారుట సహజము. నాకునది స్పష్టముగఁ దెలుసును.

పైరీతిగ సోమాగ్నులు వరుణునివదలి యింద్రుని పరమయినపిదప నింద్రుఁడు.

(5) ఈ యసురులిపుడు బలహీనులైరి. వరుణా! ఇపుడు నీవు నా యాధీనుఁడవైతివి. రాజా! వివేకా వివేకతలుదెలిసి నా రాజ్యముఁజేరుము. నన్నిఁక రాజుగ నొప్పికొనుము.

(6) ఇదిగో స్వర్గము. సౌందర్యమంతయు నిచటనున్నది. ఇచటఁ బ్రకాశరూపములగు జ్వాలలున్నవి. ఇచట వాయులోకమున్నది. సోమా! రమ్ము. మనమిరువురము వృత్రునిఁ జంపుదము. బలిహోమములందు మాకుఁ బానీయముగమ్ము. నీకు మర్యాదనిత్తుము.

పైరీతి నింద్రుఁడు తనరాజ్యము స్థిరపఱచికొని వరుణునిఁ దనయధికారమునకు లోఁగఁజేసినపిదప, సూక్తఋషి తన తాత్పర్యమును రెండుఋక్కులలోఁ దెల్పుచున్నా.

(7) బుద్ధిశాలియగువాఁడు తనబుద్ధిచే స్వర్గమును సాధించెను. అశక్తుఁడగు వరుణుఁడు నీటిప్రవాహముల కట్టువదలెను. ఇప్పుడు నదులన్నియును, యువతులరీతి, హాసన్ముఖులయి, సంతోషమిచ్చుచున్నవి.

(౮) వారిపు డింద్రుని యసమానశక్తికి లొంగినారు. సంతోషముగ వారిపుడు నాట్యమాడుచున్నవారు. ఎల్లవారు నింద్రుని రాజుగ నమ్మి భజించుచు వరుణ వృత్రులనుండి వేఱైరి.

ఇంద్రుఁడెట్లు జనించినదియు నెట్టుల శక్తినార్జించినదియు నెటు దైవమయినదియుఁ దెలియక వరుణేంద్రుల వాదమెఱుఁగుట కష్టమగును కావున నింద్రుని వార్తఁ దగినంతవఱకుఁ దెలిపి పిదప వారిరువురి వాదమునుగుఱించి మఱల వ్రాయఁ బూనెద.

"వృ" యను ధాతువు "కప్పుట" యను నర్థమిచ్చి వరుణనామమునఁ గప్పునట్టివాఁడయి, యాకాశముగమారి పిదప నాకాశరాజయి, దైవమయి దేవోత్తముఁడయి తుదకు దిశాధికారిగఁ దగ్గి నామమాత్రావశిష్టుఁడుగఁ బరిణమించినరీతిగ నింద్రుఁడును నదేదశకు గుఱియాయెను. "ఇండ్" యను ధాతువునకుఁగల "కుఱియుట" యను నర్థముమారి "కురిపించువాఁడను నర్థమునంది యింద్రుఁడను పుల్లింగ మహాత్శబ్దమాయెను. ప్రారంభమునఁ నాయింద్రుఁడు వర్షాకరశక్తులకు నధిపతియై, పిదప రాజయి, పిదప దైవమయి, దేవోత్తముఁడయి కాలాంతరమునఁ బదచ్యుతినంది యొకదిక్కునకు మాత్ర మధికారియై యిపుడు నామావశిష్టుఁడైనాఁడు. వర్షాకాలమున మారుతములు నలుదిక్కులను ఘోరముగ వీచుచు మేఘములను జలింపఁజేయుచు మెరుపుమెరయించు పిడుగుల ధ్వనులు హెచ్చ వర్షముగుఱియు విధముఁ జూడ యుద్ధమున నుభయసేన లొకటినొకటి దాకి ముష్టాముష్టి కచాకచిఁ బోరుచు గర్జింపుచు శతఘ్ని మొదలగు నాయుధ ధ్వనులు సలుపుచుఁ గత్తులు తళతళమని ఝుళిపించుచు రక్తధారలు గారుచుండురీతి నగపడెను. ఇంతటిచిత్రము గల్పించువాఁడు వర్షాధిపతియని తలంచినపిదప "నింద్రుఁడు" యుద్ధాధిపతియని నిర్ధరించిరి. ఆ యాధిపత్యమునకుఁ దగిన శక్తుల నిచ్చిరి. ఆర్యులొనరించుయుద్ధమున జయములభించినపుడా జయమింద్రునివలనఁ గలిగెనని యింద్రునిఁ దలంచుచు నతఁడే దైవమని ప్రార్థించిరి. ఈరీతిగ నింద్రుఁడు దైవమాయెను. ఆర్యుల జయము హెచ్చయినట్లెల్ల నింద్రుని మహిమసైతము హెచ్చయితుదకు నింద్రుఁడు దేవోత్తముఁడయ్యెను. అంతకుమున్ను దేవోత్తముఁడని తలంచి పూజింపఁబడుచుండిన దేవోత్తముఁడగు వరుణుఁడు మూలకుఁబడెను.

ఈ సూర్యవరుణేంద్రాదులు ప్రకృతి సాంబంధిక శక్తులని (Powers of Nature) నేను పలుమారు చెప్పనేల? ప్రారంభమున వరుణున కాధిపత్యముండినపుడు, వర్షము యొక్క ప్రాముఖ్య మార్యులాలోచింపరైరి, పిదప

ద్వాదశవర్ష క్షామము, శతవర్ష క్షామము సంభవించినతఱి, వర్ష ప్రాముఖ్య మార్యులు చక్కఁగఁ దెలిసి, వర్షమే సకలజీవులకుఁ బ్రాణాధారమని యెన్ని వర్షమును గుఱించిన యధికార మింద్రునకు నొసంగిరి. క్షామానంతరము వర్షము వచ్చినపు డింద్రుఁడు వృత్రునిఁజంపి మేఘరూపమునుండు గోవులను దెచ్చెనని యలంకార యుక్తముగఁ బలికిరి. "వృత్ర" యను శబ్దము "వృ" కప్పుటయను ధాతువునుండి పుట్టినది. ఇచట "వృత్ర" యన, మేఘములు వర్షింపనటుల వాని నావరించినవాఁడని యర్థము. గోవులు తమ పొదుగులలోనుండు పాలును స్రవింపఁ జేయునటుల మేఘములు తమలోనిండిన నీటిని స్రవింపఁజేయును గావున మేఘములను గోవులుగఁ బోల్చినారు. అట్టి మేఘము లాకాశమున గానరానటులఁ జేసిన "వృత్రు" నింద్రుఁడు చంపి మఱల గోవులను మేఘములను దెచ్చినవాఁడింద్రుఁడు కావున నింద్రుని గౌరవము హెచ్చెను. ఈ విషయమగు ఋక్కులు ఋగ్వేదమునందెల్లెడ నిండినవి. పై యంశము లెల్ల మనమున నుంచుకొని వానినిఁ జదివినయెడల నే కష్టము లేనటుల యాఋక్కు లర్థమగును. ఈ విషయమిచట నింతలో వదలి ప్రస్తుతాంశమగు వరుణేంద్ర సంవాదమునకుఁ బ్రారంభింతము.

ఇంద్రుఁడు పుట్టఁగనె యతిబలశాలియయి దైవములకు భీతిఁ గలిగించు పనులొనర్చెనని,

2. 12-వ సూక్తములో వర్ణింపఁబడినది,

4. 19-వ సూక్తములో నింద్రుని సామర్థ్యమును మెచ్చినారు.

4. 30. (1-5) లో నింద్రుని సామర్థ్యమునకు దైవములు లొంగినారు.

M. 1. 131 (1-3) లో నింద్రునిశక్తికిమెచ్చి వానికి బలులుసమర్పింతురు.

1. 174 }
6. 36. (1) } ఇంద్రుని రాజ్యాభిషిక్తునిఁజేసి వానిశక్తులు నుతింతురు "క్రోధమూని యుద్ధమొనర్చిన దైవములనెల్ల నీవొక్కఁడవె
6. 30. (5) } యోడించి చంపితివి."

ఆర్యు లింద్రునకు నెంత యాధిక్యము నిచ్చుచుండిరో యంతకంటె నికృష్టతగ నైరాను లింద్రునిఁ జూడసాగిరి. కావుననే దేవతలను రాక్షసులని పిలువసాగిరి.

M. 2. 12. [1] ఇపుడేపుట్టి శక్తిచే నతిసాహసుఁడయిన వాఁడును ముందుదైవములనెల్లఁ గాపాడువాఁడును శక్తియుతుఁడును, శ్వాసచలనము నను భయలోకములు జలదరింపఁజేయువాఁడును, నగువాఁడింద్రుఁడేను.

7. 21. (7) "పురాతన దైవములు సైతము నీ దివ్యతేజమునకు నమ్రులైరి"

అనఁగ నార్యులకుఁ బురాతన కాలముననుండిన దేవగణ మొకటియు, నూతనదేవగణమొకటియు రెండువిధముల దైవములుండెను. ఇంద్రుఁడు నూతన దేవగణములోఁ జేరినవాఁడు.

1. 131. లో నింద్రునియెదుట నసురయగు "దివి" తలవంచెను. భూమాత పృథ్వి తలవంచెను. సర్వదైవము లేకవాక్యతగ నింద్రుని దేవోత్తమత్వము నకు సమ్మతించిరి. ఇంతటినుండి మనుజులిచ్చు బలుల నింద్రుఁడు స్వీకరింప సాగెను.

ఇచట "నసురదివి" యనుటలోఁ బ్రాణమునిచ్చుప్రకాశమని యర్థము సేయవలెను (Goddess of Living light) సర్వులకుఁ బ్రాణప్రదాయికమగు వస్తువు దివియనుదీపము. ఆప్రకాశములేనిదే ప్రాణముండదు కావున "అసుర" శబ్దముపయోగింపఁబడినది. "భూమాతపృథ్వి" యన దివివలనఁ బ్రాణముగలిగిన జీవకోటినిరక్షించునది భూమికావున మాతృశబ్ద ముపయోగింపఁబడినది. గాలి వానలులేక ప్రాణములు నిలువనందునను గాలివాన లింద్రునుండికలుగునని యార్య లభిప్రాయ పడియుండిరికావునను నింద్రుఁడే దేవోత్తముఁడని భావించుటకుఁ గారణ మయ్యెను కావుననే M. 1. 174 లో దైవములకెల్ల రాజని యింద్రుఁడు నుతింపఁ బడినాఁడు. అనఁగాఁ బ్రకృతిసాంబంధికశక్తు లింద్రునిశక్తికి వశమయ్యెనని యర్థము. ఇంద్రుని బలఫలములగు మేఘోత్పత్తి మరుదుల్బణములు కలిగినపుడుదివి ప్రకాశము డఁగును. సూర్యచంద్రాదిగ్రహముల గతులు బాహ్యేంద్రియములకుఁ గానరావు. అగ్ని రాజిల్లదు. అంధకారము ప్రపంచమంతయును వ్యాపించి యెద్దియుఁ గాన రానటులగును. కావున నింద్రుని యనుగ్రహ మవశ్యకమయ్యెను. ఏరానులార్యత యింద్రునిఁ దుచ్ఛీకరించి యంతకుమున్న సనాతనకాలమునుండి యుండిన దైవమగు వరుణుని "అర్ మజ్దు" యను నామమునఁ బూజింపసాగిరి. ఋగ్వేదమునందు వరుణునకు నారోపింపఁబడిన శక్తులన్నియును నొక్కచోటఁగూర్చి "జెండవస్థ" లోని "అర్ మజ్దుకుఁగల విశేషణములతోఁ బోల్చినయెడల వరుణునకు "అర్ మజ్దు"కు భేదమెద్దియు లేదనుట స్పష్టమగును.

M. 2. 1. (4) వరుణుఁడు దేవోత్తముఁడు. దేవులలో దేవుఁడు. దేవులకు దేవుఁడు. జెండవస్థలో "అర్ మజ్దు" "భగభగానాం" యని యుంటయ గాక శాసనములోసైత మదేరీతిగ నున్నది.

వరుణుఁడు సూర్యుని నక్షత్రములను జలములను నేలువాఁడని

ఋగ్వేదములోనున్నది. "ఆర్మజ్డు"కు సైత మివే విశేషణము లున్నవి. (Y. 31. 7.)

(3) వరుణుఁ డాగమవిధులకు నధికారియని యుభయుల గ్రంథములలో నున్నది.

(4) సమస్త న్యాయవిధులను నీతివిధులను గాపాడువాఁడు వరుణుఁడని ఋగ్వేదముననున్నది. "ఆర్మజ్డు"కు నిదేశక్తి యుండినటుల Y. 29. 4-6 లో నున్నది.

(5) వరుణుఁడు పాపనాశకుఁడు. ఆర్మజ్డు పాపశిక్షకుఁడని Y. 30. 11, 7, 32 లో నున్నది.

(6) వరుణుఁడు పాతకుల మన్నించువాఁడు. పుణ్యులను రక్షించువాఁడు. (ఆర్మజ్డుసైత మట్టివాఁడేను (Y. 29-11)

(7) వరుణుఁడాదిత్యుఁడు రాజు. ధృతవ్రతుఁడు మాయి సుశంసుఁడు. సుచక్షువు, సుక్షేత్రుఁడు. పైవిశేషణములే ఆర్మజ్డునకు గలవు.

పై రీతిగ నైరానులు సనాతనకాలమునుండి ఆర్మజ్డను నామమున వరుణుని "ఏకదైవముగ" నుపాశించుచు వచ్చిరి. ఆర్యులుమాత్రము తమయిష్టానుసారము ప్రకృతిశక్తులకు దేవత్వముగల్పించి గౌరవింప నారంభించిరి.

వరుణుని మూలకుఁద్రోసి యాస్థానమునకువచ్చిన యింద్రుని జనన వార్తను దెలుపుచు M. 4. 18-వ సూక్తమున్నది. ఆ సూక్తములోని వాక్యములు గొన్నిచోట్ల దురవగాహములుగనున్నవి. ఎవరెవరి నుద్దేశించి పలికినది చక్కఁగఁ దెలియరాదు. అయినను నర్థమయినంతవఱకు నూహలపై నీక్రింద వివరించినాను. ఇంద్రుఁడు గర్భముననుండు కాలముననే విశేషముగఁ బెఱిఁగి క్రమమార్గమున రాఁజాలక ప్రక్కలు చీల్చుకొని వచ్చుటకుఁ బ్రయత్నించెనఁట. అపుడు తల్లియగు నదితి.

4. 18. (1) దైవములందఱు జనించినట్టియుఁ బురాతనమునుండి యందఱు సమ్మతించినట్టియు మార్గమిదేను. ఎంతబలవంతుఁడయి పెఱుఁగువాఁడయినను, వాఁడువచ్చు మార్గమిదేను, వేఱుపథము నవలంబించి తల్లినిఁ జంపకుండుము.

౪:క్రమ:--(2) ఆ మార్గమునుండి నేనువెళ్లను. ఆ మార్గము కఠినము. ప్రక్కలో నుండి యడ్డముగ నేనువెళ్లెదను. ఇదివఱ కింకను గాని పనిని నేఁ జేయఁదగినదిగ నున్నది. ఒకరితో యుద్ధమాడవలసినదిగ నున్నది. రెండవవాని నెదురవలసినది.

(3) చనిపోవు తల్లి తలవంచుకొనెను. నా, శపథము నే మరల్చుకొని యెద. నీమార్గ మవలంబించెద. త్వష్టృ గృహమున నింద్రుఁడు సోమ పాన మొనర్చెను. శతాధికముగఁ ద్రావెను.

(4) తల్లిగర్భమున సహస్రమాసములు, బహు శిశిరములుండిన బాలుఁడే సాహసకృత్యము లొనర్చెను? జనించినట్టి వారిలో వాఁడసమా నుఁడు. పుట్టఁబోవు వారిలో నైతము వానిసమానుఁడు లేఁడు.

(5) వానిపుట్టుక నింద్యమని తెలిసి తల్లి వానిని దాఁచెను. అయినను వానికి శౌర్యత్వ మొనఁగూడి వెంటనె పైకి నెగిరెను. తనవస్త్రములు ధరించు కొనెను. భూమ్యాకాశములు నిండెను.

(6) ఈ జలములన్నియును ధ్వనించుచుఁ బ్రవహించుచున్నవి. ప్రవా హము లన్నియు నేమిపలుకునో యే పాషాణమును జీల్చెనో వానినిఁ బ్రశ్నింపుఁడి.

(7) ఆప్రవాహము లా యింద్రునకు స్వాగతము లిచ్చుచున్నవియా యేమి? ఇంద్రునకు నొదవిన యవమాన మీ ప్రవాహములు భరించునా? గొప్పదగు పిడుగను నాయుధముచే నా కొమారుఁడు వృత్రునిఁ జీల్చి నదులకు మార్గమిచ్చెను.

(8) నీ వయస్సు తల్లియగు నేను నిన్ను దూరముగఁ బాఱవైచితిని. నా కడుపునఁబుట్టిన కొడుకును నిన్ను "కుషవ" మ్రింగెను. నా బాలుని పైన జలములను గ్రహించెను. నా సుతుఁడింద్రుఁడు జయశీలుఁడయి లేచెను.

(9) మఘవన్! వ్యంసుఁడు నిన్ను నేలకుఁగొట్టి దవడపండ్లు విఱిచెను. నీవు నా కొమారుఁడు. అటులఁ గొట్టఁబడినను నీవు సర్వాధిపత్యము సాధించితివి. పిడుగుచే దాసునితలఁ ద్రుంచితివి.

(10) ఆ జేయతనందిన వృషభేంద్రుని, శక్తివంతుని, నదితి గోవు కనెను. దూడకుఁ బాలివ్వక నే తల్లివదలెను, బాలుఁడు తనదారిఁదాను జూచి కొనుచుఁ బోయెను.

(11) అప్పుడు గౌరవరుండగు సుతుని సరసంజని పుత్రా! యా దైవములు నిన్ను వదలిరి. వృత్రునిం జంపు కార్యమున విష్ణువు ధైర్యమున ముందరికి వచ్చెనని యింద్రుండు పలికెను.

(12) నీ తల్లిని విధవను జేసినవాం డెవండు? నిశ్చేతనుండవయి పడిన నిన్నుం జంపం బూనిన వాం డెవండు? నీవు నీ తండ్రినిం గాళ్లుంబట్టి చీల్చినపు డే దేవుండు నిన్నాదరించెను?

(13) ఘోరబాధలంది శ్వానమాంసమును నేను వండితిని. దైవములలో నన్నాదరించిన వాం డొకండును లేండు. నా భార్య దిక్కులేనిదాయెను. గరుత్మంతుం డప్పుడు సోమలతను దెచ్చెను.

పైబుక్కు లసంబద్ధ ప్రలాపములైనను, గొప్పక్షామము వచ్చి జనులకు జలాహారములు లేక, దైవములకు బలులు లేక నదులింకి నీరు లేక, శ్వానమాంసము సైతము దినునంతటి కాలము తటస్థించెననియు నంతటి కాలమున భూమి బీటువాఱి, యెండి, యుండెననియు నెంతో కాలమునకు వర్షము వచ్చెననియుం దెలియవచ్చుచున్నది. ఇంద్రుండు సహజమగు మార్గమునం బుట్టలేదను వాక్యమునకు నర్థము, " వాన యొకదిక్కున నేపడక నలుదిక్కులం బడెననుట. సహస్ర మాసములు గర్భములో నుండెననిన, నంతకాలము వఱకు నంతవాన కుఱియ లేదని భావము. తలిదండ్రులను జంపివైచెననిన భూమ్యాకాశములు జీల్చుకొని వర్షము వచ్చెనని యర్థము. ఇంద్రుని దంతములను తండ్రి పిలుంగంగొట్టెననిన వడగండ్ల వాన వచ్చెనని భావము. ఇంద్రుండు తనతండ్రినిం జీల్చెననిన నాకాశముగుండా యింద్రాయుధము వ్యాపించెననుట. తలిదండ్రులు దూరమున నింద్రునిం బాఱవైచి రనిన వానను భూలోకమునకుం ద్రోసిరని భావము. ఇటులనే యూహలపై నీ సూక్తమునకు నర్థము సేయవలెను. వానకుఱియనటుల మేఘములను బంధించి యుంచు ప్రకృతిశక్తికి వృత్రయను నామమిచ్చి వాండు జనులను బాధించు రాక్షసుండని భావింపసాగిరి. ఈ సూక్తాధికారియగు వామదేవఋషికి నప్పటి ఘోర క్షామమునం గలిగిన యనుభవము వ్రాయంబడినదని కొందఱియభిప్రాయము. శ్వాన మాంస మతినింద్యమయినను దానినిం దినునంతటి కాలము తటస్థించియుండెనని తెలియవచ్చుచున్నది. ఇంద్రుండు జననమందినతోడనె యనంగా, వానవచ్చినతోడనె సోమలతయందు పాలుద్భవించును కావున సోమపానమునం దింద్రుండు పుట్టిన తోడనె యపేక్షకలవాండాయెనని వ్రాయంబడినది. గరుత్మంతుండు స్వర్గమునుండి

ఇ: సోమలతఁ దెచ్చెననిన, శతవర్షతూనుమున నెచ్చటను సోమలతయెండి కొనరాకి యుండగా, వానవచ్చినతోడనె యది మొలకవేసి కొన్నిదినములకు వృక్షమురీతిఁ బెద్దదగుచువచ్చెను. గరుత్మంతునకది ప్రియమగు వృక్షముకావున దానిపై వ్రాలెను. అదిగని యప్పటియార్యులు గరుత్మంతుఁడు సోమలతఁదెచ్చెనని భావించిరి. ఇది నా యూహ. సోమపానమునం దింద్రునకు నపేక్షయని యింద్రునకు "సోమపా"యను నామమిడిరి. బాల్యముననే యింద్రుఁడు సోమపానమునం దపేక్షకలవాఁడయ్యెనను టకు నీ క్రింద వ్రాయఁబడిన సూక్తమున్నది.

3. 4క్. (1) బాలవృషభము (ఇంద్రుఁడు) జనించినతోడనె, పిండఁబడిన సోమ రసమును ద్రావనపేక్షించెను. ఇంద్రా! ఈ మహనీయమయిన రస మును నీ యిష్టానుసారము తృప్తికరముగఁ ద్రావుము.

(2) నీవు పుట్టినదినముననే సోమరసమును ద్రావ నపేక్షించితివి. పర్వత ములవలనఁ దెంపఁబడిన సోమరసమును ద్రావుము. నిన్నుఁగనినతల్లి, నీ తండ్రియింటిలో సోమక్షీరమునుఁబోసి నిన్నుఁ బెంచెను.

(3) ఆహారాపేక్షకుఁడయి నీవు నీ తల్లినిఁ జేరితివి. నీ తల్లి యెదపై సోమ లతను జూచితివి. ఇతరులను దూరముగనుంచి నీ వొక్కఁడు బుద్ధి కలవాఁడవయి యనేకశక్తులతో బలుసాహస కర్మములొనర్చితివి.

వానవచ్చినంతనె సోమలతలోఁ బాలుపుట్టుట సహజము. వానవచ్చిన దేశము సుభిక్షమయినతోడనె యజనాద్యాగమ కర్మములొనర్చుటకు సోమలతనుఁ బిండి యింద్రునకు నా రసమునుఁ బానీయముగఁ బలినిత్తురు. ఈ రసమును ద్రావి యింద్రుఁడెటు తన సామర్థ్యమునుఁ దానె యుగ్గడించి పలికెనో యా సూక్తమును నేనిదివఱకే వ్రాసినాను. ఆర్యులు పంజాబుఁజేరి దస్యులతో యుద్ధమొనర్చి దేశములు సాధించి తమయునికిపట్టు భద్రపఱచికొను నంతవఱకు వా రింద్రుఁడే తమదైవమని మిక్కిలి గౌరవముగఁ బూజింపసాగిరి. ఆ గౌరవ మార్యులు గంగాతీరమువఱకు దేశములు సాధించి యచట రాజ్యములు స్థాపించునంతవఱకు నుండినది. అనఁగా బ్రాహ్మణముల కాలములోను నుండినది. పిదప నిప్పటి త్రిమూర్తు లుద్భవించు టకు మొదలిడి, పురాణయుగమునఁ ద్రిమూర్తుల మహిమ యతివిచిత్రముగ గౌరవింపఁబడినది. భాగవతకాలమునకు నింద్రునకు బలులిచ్చి యుత్సవములు సలుపు, కర్మసైతము నిలుపఁబడినది. ఈ కాలము వచ్చునంతవఱకు నార్యులు విగ్రహారాధకులయి యుండినరీతిగ నగపడదు. గుళ్లవిషయము ఋగ్వేదమున నెచ

నను బలుకఁబడలేదు. ఇప్పుడార్యులొనరించు నాగమహోత్సవ బల్యర్పణముఁదప్ప మంగళవ్రతదీక్ష లెవ్వియు నుండలేదు. లక్ష్మీపార్వతుల నామములే యప్పటి యార్యులకుఁ దెలియవు. అప్పటిలో నింద్రుఁడు తనసాహసమునఁ జంపినవారెవరనిన అహి, యర్బుద, యార్ణనాభ, అశ్నా, బ్రసయు, చుమురి, దానోని, ధుని, ద్రిభిక, ఇల్బీస, కరంజ, కునారు, కుషాన, కృప, కుయవ, మృగ, మృగయు, నముచి, పాని, పర్ణయ, పిప్రు, రుధిక్రా, శంబర, శుష్ణ, స్వర్భాను, స్వశ్న, యురాన, వాల, వంగృద, వర్చిన్, వితాను, విశ్వాక్, వ్యంస, వృత్ర;

వీరివిషయమునఁగల ఋక్కులుగొన్ని వ్రాయకయున్న వీరెవరయి యెరుఁగ నించుక తెలిపినఁగాని యజ్ఞులకు బోధపడదు.

సూర్యరశ్మి జలమునుఁజీల్చి మరుత్సహాయమున నున్నతప్రదేశమునకుఁ గొనిపోయి యచట శీతవాతమువలన నాజలము ఘనీభవించి మేఘలోకమేర్పడుట ప్రకృతి సహజమహిమ. మఱల ఋతువిధుల ననుసరించి ఘూంఘూర్మారుతశక్తిని ఘనీభవించిన మేఘమండలము జలవరించి మేఘాంతర్గతజలము మఱల భూమికిఁ గురియుట ఋతువిధిక్రమము. పైరీతి నార్ద్రధూమము జలమునావరించి స్రవింపకుండు నట్లు చేయును కావున దానికి వృత్రయను సంకేతనామము. అటు ఘనీభవించిన మేఘము లనేకములగు చిత్రాకారములుగొన్ని యగపడుటచే నాయాకారములకు నార్యులు భిన్ననామములిడి, వారురాక్షసులని పేరిడిరి. అట్టిమేఘరూపముల నామములు గొన్ని పైపట్టికలోఁ జేరినవి. ఇంద్రుఁడు మరుత్సహాయమున మేఘములనుజీల్చి వర్షము గురియులాగొనరించెను.

I. 1, 32-వ సూక్తములో "వృత్రాహి" శబ్దములున్నవి. మేఘమండలమున మేఘముల నావరించి దాఁచినవాఁడు వృత్రుఁడు. పర్వతములపైన వ్రాలిపడిన మేఘపఙ్క్తికి నహియని పేరు.

83. [4] పాణియను నామమున్నది. మేఘపఙ్క్తిగుహలో దాఁచి లోభిబలె నీరు వెలికివదలక యుండువాని పేరు.

13 "వాలి" యని యున్నది. మేఘములనుదాఁచిన గుహాధికారి.

51. "అర్బుద" యని యున్నది. గాలిలో వానచినుకులు జిక్కించుకొనిన వాని పేరు సుష్మ. నీరు నెండించువాఁడు శంబర పిప్రుయనువారు గాలిమార్గమున నీరు క్రిందఁబడినటుల దూరమునకుఁ దీసికొనిపోవువారు.

నైఋతి వశీ ఋక్కులలో నీ యసురుల నామములున్నవి. వీరు ధూమ దేవతలు. ప్రకృతిశక్తుల నెదిరించుశక్తులివి.

ఇంద్రుఁ డహల్యాజారుఁడని మన పురాణగాథలు పలుకుచున్నవి. ఆ విషయమును గుఱించి రామాయణములోఁ బెక్కువిధముల వర్ణింపఁబడినది. అహల్యయన దున్నఁబడక బీడుపడినభూమి. ఆ భూమినిఁ దడపుటచే నింద్రునకు నహల్యాజారుఁడని పేరుకలిగెను. సహస్రాక్షుఁడని యింద్రునిపేరు. అనేకముఖములుగ వర్షధారలు కురిపించువాఁడని యర్థము. "శతక్రతుఁ"డన ననేకకర్మము లాచరింపఁ జేయువాఁడని యర్థము. మఘవానన ననేకయాగము లొనర్పఁ జేయు వాఁడని యర్థము. అహల్యయనఁ జీకటియనియు నింద్రుఁడన సూర్యుఁడనియు చీకటినిఁ జెఱచినవాఁడు సూర్యుఁడు కాఁబట్టి యింద్రునకు నహల్యాజారుఁడని పేరు వచ్చెనని కొందఱి యభిప్రాయము. ఈరీతి వానగురియుటవలనఁ గలుగు ఫలముల కెల్ల నింద్రుఁడధికారిగ నెంచి నామములిచ్చినారు. ఋగ్వేదమునం దనేకఋక్కులలో నింద్రుఁడొకదినమున నూరుకోటలు చీలఁగొట్టినవాఁడని యున్నది. దస్యులీ కోటలు పర్వతములపైఁ గట్టియుండిరి. భూమి వర్షాపాతమునఁ గోటలు పడిపోయినప్పుడు కోటలింద్రునిచేఁ బడఁగొట్టఁబడెనని వర్ణించినారు. పిడుగులుపడి చీలినప్పు డింద్రాయుధమునఁ జీల్పఁబడెనని వర్ణించినారు. ఇట్టివాక్యములు వచ్చినప్పుడు చదువరులు బుద్ధినుపయోగించి యర్థముచేసికొనవలెను. ఋగ్వేదమునం దింద్రునిగుఱించిన ఋక్కులు మిగతదైవములకంటె హెచ్చుగనున్నవి.

ప్రజాపతి తనబిడ్డను మోహించెనని యున్నది కావున నార్యుల దైవములకు సైతము నీతిలేదని కొందఱాక్షేపించినారు. ఇటులనే బౌద్ధులాక్షేపించి నపుడు కుమారిలభట్టను పండితోత్తముఁడు క్రిందవ్రాసినరీతిగ సమాధానము చెప్పెను. "సృష్టికర్తయగు ప్రజాపతి సూర్యుఁడేను. ప్రజలను రక్షించును గావున ప్రజాపతియను నామమువచ్చెను. సూర్యునిబిడ్డ యుషస్సు. దానిని మోహించె ననఁగా సూర్యోదయకాలమున సూర్యుఁ డుషస్సును వెంబడించును కావున మోహించి వెంబడించెనని వర్ణించినారు. సూర్యుఁడు వచ్చుటవలన యుషస్సు పుట్టును కావున "ఉషస్సు" సూర్యునిబిడ్డయని పిలిచినారు" ఆర్యుల యర్థమును దెలియక యార్యులదైవమగు నింద్రుఁ డహల్యాజారుఁడని నిందించుట తప్పు.

అతిపురాతన నార్యుఁడేమియుఁ దెలియక చిత్రమహిమలు గలిగించుశక్తి ...దియగోచరముగాక యొకటియున్నదని యూహించి యాశక్తిని నుతించు నగ్నినిఁ గనిపెట్టి యగ్నియేదైవమని భావించి యిప్పటికిని నగ్నియే

ప్రకటన.

బళ్లారిలో వకీలుగానుండి కీ. శే. కోలాచలం శ్రీనివాసరావుగారిచే రచియింపబడిన యీక్రింద వివరించిన యుపన్యాసములన్నియును విక్రయమునకుసిద్ధముగనున్నయవి.

1.	ఆర్యుల నాగరికత వారి ప్రపంచవ్యాపకత.	0-8-0
2.	ఆర్యుల చరిత్ర, ఋగ్వేదభాష మొదలగునవి.	0-8-0
3.	ఋగ్వేద విభజన వేదకాల విభజన మొదలగునవి.	0-8-0
4.	ఆర్యులుపంజాబు చేరిన విధము వారిశాసనము.	0-8-0
5.	మద్యపానము జూదము స్త్రీలగుణములు మొదలగునవి.	0-8-0
6.	వివాహకట్టడములు ...	0-8-0
7.	జాతిచట్టములు ...	0-8-0
8.	సృష్టిని గుఱించిన తాత్పర్యము.	0-8-0
9.	వేదమతము నాస్తికమతము ఆర్యులదైవములు.	0-8-0
10.	నరమేధ అశ్వమేధాది యజ్ఞములు.	0-8-0
11.	అదితి ద్వాదశాదిత్యులు మొదలగునవి.	0-8-0
12.	యమ యమి మృత్యువు పితృదేవతలుకర్మ మొదలగునవి	0-8-0
13.	సోమపానము అశ్వినులు రుద్రుఁడు పర్జన్యుఁడు.	0-8-0
14.	ఋషులు, సప్తర్షులు, దధీచి, చ్యవనుఁడు మొదలగునవి.	0-8-0
15.	ఋగ్వేదములోని ముఖ్యప్రార్థనలు	0-8-0
16.	మతవిధులేరీతిగఁ బ్రబలినది ...	0-8-0

వలయువారు ఈక్రింది చిరునామాకు వ్రాయవలయు.

కె. శత్రుఘ్నరావు,

సివిల్ లైన్సు, బళ్లారి.